క్లుప్తంగా

23న పత్తికొండలో జాబ్‌మేళా

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ మాధురి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదివి ఉండి 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి ప్రారంభ వేతనం నెలకు రూ.13,500 నుంచి రూ.20వేలు వరకు ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 23న ఉదయం 9.30గంటలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ 9014588552 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మద్దికెర : మండల కేంద్రంలో భవానీ మాలధారులు గురువారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భవానీ దీక్షపరులు అమ్మవారి గీతాలు ఆలపించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పూజలకు విచ్చేసిన వారికి అన్నదానం చేశారు. గురుస్వామి శ్రీనివాసులు, కోళ్లపారం లక్ష్మీనారాయణ, భాస్కర్, కిట్టి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రమైన వెల్దుర్తికి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం రానున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం తెలిపారు. పట్టణంలోని డోన్‌కు వెళ్లే దారిలో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఉదయం 9 గంటలకు వస్తున్నారని, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

మదుపరుల సొమ్ముకు పోస్టాఫీసు ఉత్తమం

ఆలూరు: సంపాదనలో కొంత మొత్తాన్ని భవిష్యత్‌కు స్థానిక పోస్టాఫీసు మదుపు చేయడం ఉత్తమమని ఆలూరు సబ్ పోస్టుమాస్టర్ నాగరాజ్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో తన పరిదిలోని బీపీఎంలతో,ఈడీ ఎంసీ, డాక్ సేవకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు ఆధార్ కార్డు లింక్ కాకపోతే స్థానిక పోస్టాఫీసులో చేయాలని ఉత్తర్వులను జారీ చేశాయని చెప్పారు. అందుకు గాను తమ పరిధిలో ఉన్న 12 మంది బీపీఎంలకు అవగాహన కల్పించామన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దేవనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ గౌరీదేవి గురువారం తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

పత్తికొండ(తుగ్గలి) : ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ప్రకారం కందులు కొనుగోలు కోసం శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు పత్తికొండ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటరాముడు తెలిపారు. కంది పంట సాగు చేసి పంట నమోదు చేసుకున్న రైతులందరూ ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ హాస్టల్ మంజూరు



రికార్డులను తనిఖీ చేస్తున్న పి.గీత

దేవనకొండ: కప్పట్రాళ్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సీజనల్ హాస్టల్ మంజూరైందని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారిణి పి.గీత తెలిపారు. గురువారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ విజ్ఞప్తి మేరకు గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

పత్తికొండ(తుగ్గలి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తాలూకా నాయకులు రాముడు, రవికుమార్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అమిత్‌షా ఫొటోలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

హొళగుంద: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎస్డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌డీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి సుభాన్ మాట్లాడారు.

ఎంపీడీఓ కారుపై రాళ్లు రువ్విన ఆకతాయిలు

హాలహర్వి: కామినహాల్ గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఎంపీడీఓ ప్రభుత్వ వాహనంలో హాలహర్వికి వెళ్తుండగా గ్రామశివారులో కొందరు ఆకతాయిలు ఎంపీడీఓ ప్రయాణిస్తున్న కారుపై రాళ్లు రువ్వారు. దీంతో కారు వెనకవైపు సిగ్నల్ లైట్ పగిలిపోయింది. వెంటనే కిందకు దిగి రాళ్లు రువ్విందెవరని ఆరా తీయగా.. స్థానికులు తమకేమీ తెలియదన్నారు. దీంతో చేసేదేమి లేక ఆమె కారులో వెళ్లిపోయారు.

ఇళ్ల నిర్మాణాలు సాగేదెలా?



నంచర్ల జగనన్న కాలనీలో మమ్మతులకు నోచుకోని విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్

చిప్పగిరి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణాలు కూటమి ప్రభుత్వంలో మౌలిక వసతుల కొరత కారణంగా ముందుకు సాగడం లేదు. మండలంలోని నంచర్ల గ్రామంలో మొత్తం 98 వరకు ఇళ్లు మంజూరు కాగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుండడంతో కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే కాలనీలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నీటి మోటార్ మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలకు నీరు, విద్యుత్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్, పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



నంచర్ల జగనన్న కాలనీలో మమ్మతులకు గురవడంతో నిరుపయోగంగా నీటి మోటారు

ఆధార్..ఆందోళన!

- నత్తనడకన బాల ఆధార్ నమోదు
- మండలానికి రెండు సెంటర్లలో సాగుతున్న ప్రక్రియ
- నియోజకవర్గంలోని 307 అంగన్‌వాడీల్లో 17,113 మంది 0-6 వయస్సు పిల్లలు
- 98 సచివాలయాల్లో 9 ఆధార్ నమోదు కేంద్రాలు

బాల ఆధార్ నమోదులో ఎనలేని నిర్లక్ష్యం చోటు చేసుకుంటోంది. ప్రత్యేక శిక్షణ ఇచ్చి అథంటికేషన్ ఇచ్చిన ఉద్యోగులు మాత్రమే ఆధార్ నమోదు చేయాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలో తొమ్మిది మంది డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే ఉండటం, మండలానికి 4-5 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో నమోదు ప్రక్రియ ఇప్పట్లో పూర్తయ్యేలా లేదు. మొత్తం 307 అంగన్‌వాడీ కేంద్రాల్లో 17,113 మంది ఆరేళ్ల లోపు చిన్నారులు నమోదు చేయించుకోవాల్సి ఉంది. మూడు రోజుల పాటు ఆరు మండలాల్లో నిర్విరామంగా కొనసాగించగా.. కేవలం 153 మందిని మాత్రమే నమోదు చేయగలిగారు.

ఆలూరు రూరల్: బాల ఆధార్ నమోదు ప్రక్రియతో చిన్నారులు,తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల్లో పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 0-6ఏళ్ల లోపు పిల్లలకు అందించే పౌష్టికాహారం పొందాలంటే ఆధార్ తప్పనిసరి. ఇందులో భాగంగానే కేంద్రం ఈ నెల 17 నుంచి 20 వతేదీ, 26 నుంచి 28వ తేదీల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తగినన్ని ఆధార్ నమోదు కేంద్రాలు లేక నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గడిచిన మూడు రోజుల్లో ఆరు మండలాల పరిధిలో కేవలం 153 మాత్రమే ఆధార్ నమోదు జరిగింది. అధిక శాతం తల్లిదండ్రుల వద్ద పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేకపోవడం,ఉన్నతాధికారులు పంపిన జాబితాలో పేర్లు, చిరునామాలో తప్పులు ఉండటంతో ఆధార్ నమోదు మరింత జాప్యం జరుగుతోంది. నియోజకవర్గంలో డిజిటల్ అసిస్టెంట్లు 9మంది మాత్రమే ఉండగా..వీరు తొమ్మిది కేంద్రాల్లో బాల ఆధార్ నమోదు చేస్తున్నారు.

మండలానికి రెండు సెంటర్ల ఏర్పాటు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 98 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతి మండలంలో 4 నుంచి 5 ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించాల్సి ఉండగా కేవలం రెండు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ప్రత్యేక బాల ఆధార్ నమోదు నత్తనడక సాగుతోంది. ఆధార్ నమోదు చేయడం కోసం ఎంపీడీఓలు సచివాలయ ఉద్యోగులను ఎంపిక చేసిన అథంటికేషన్ కోసం వారితో పరీక్ష రాయించాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా జరగలేకపోవడంతో మండలానికి కేవలం ఒకరిద్దరు ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాలకు ఉన్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు వెళ్లి ఆధార్ నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో ఆధార్ నమోదు లక్ష్యం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు.



ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

307 అంగన్‌వాడీల్లో 17,113 మంది పిల్లలు

ఆలూరు నియోజకవర్గంలోని ఐసీడీఎస్ పరిధిలో ఆలూరు, ఆస్పరి క్లస్టర్లు ఉన్నాయి. ఆలూరు క్లస్టర్ పరిధిలో 176 అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పరి పరిధిలో 131 మొత్తం 307 సెంటర్లు ఉన్నాయి. ఇందులో 0-6 వయస్సు ఉన్న పిల్లలు 17,133 మంది ఉన్నారు. 98 సచివాలయాల పరిధిలో ఆయా గ్రామాలకు వెళ్లి ఆధార్ నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ సచివాలయాల పరిధిలో కేవలం 9 ఆధార్ కేంద్రాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఒక్కో సెక్టార్ పరిధిలో ఆరుగురు డిజిటల్ అసిస్టెంట్లను నియమించినా ఆధార్ ప్రక్రియ పూర్తయ్యేలా లేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్య పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలాల వారీగా 0-6 ఏళ్ల పిల్లల వివరాలు..

మండలం	అంగన్‌వాడీలు	0-6 పిల్లలు	ఇప్పటి వరకు ఆధార్ నమోదు
ఆలూరు	51	2,765	69
ఆస్పరి	57	3,481	30
చిప్పగిరి	30	1,293	27
హాలహర్వి	46	2,536	00
హొళగుంద	49	2,177	16
దేవనకొండ	74	4,861	10

ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచుతాం



ఆధార్ నమోదు కేంద్రాలు పెంచాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. డిజిటల్ అసిస్టెంట్ల కొరత కారణంగా మండలంలో రెండు చోట్ల మాత్రమే ఆధార్ నమోదు జరుగుతోంది. ఏడు రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయలేరు. రోజుకు 25 నుంచి 30 ఆధార్ మాత్రమే నమోదు చేయగలరు. ప్రత్యేక ఆధార్ శిబిరాల తేదీలు పెంచి నాలుగు సెంటర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సూర్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ,ఆలూరు

కనుల పండువగా పూల రథోత్సవం



భక్తుల మధ్య ముందుకు కదులుతున్న పూల రథం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు


హాలహర్వి: మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వర స్వామి (గాదిలింగప్ప తాత) 21వ పూల రథోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ఆకుపూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గంగపూజ తదితర పూజా కార్యక్రమాలు జరిపించి మంగళహారతులు, నందికోలు ప్రదర్శన, కోలాట తదితర ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తుని పల్లకీలో ఊరేగించి రథంపై అధిష్టింపజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథ చక్రాలు ముందుకు కదిలాయి. రథాన్ని ఎదురు బసవన్నగుడి వరకు లాగి, అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తిరిగి యదాస్థానానికి చేర్చారు.

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే


గాదిలింగేశ్వరస్వామి రథోత్సవంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు శశికళ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదట అంబేడ్కర్‌కు, వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి వారిని ఊరేగించారు. అలాగే గూళ్యం గాదిలింగేశ్వరస్వామి అన్నదాన సత్రానికి రూ.10 వేలు, దేవాలయ అభివృద్ధికి రూ.25 వేలు ఎమ్మెల్యే అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు రామిరెడ్డి, మండల యూత్ లీడర్ గంగాధర, సర్పంచ్ ఉలిగమ్మ, ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు అర్దగేరి తిప్పారెడ్డి, వీరేశప్ప, కుమారస్వామి, ఎల్లప్ప, గోపాల్, లింగప్ప, నాగరాజు, కృష్ణ, దిబ్బలింగ, బసవరాజు,శేఖన్న,లక్ష్మీనారాయణపాల్గొన్నారు. ఎస్ఐ చంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీల్లో కనిపించని ఆధార్ నమోదు

హొళగుంద: ఈ నెల 17 నుంచి 20 తేదీ వరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన ఆధార్ సెంటర్లు సచివాలయంలో కొనసాగించడంతో చిన్న పిల్లలు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో ఉండే 0-6 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ అయినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కడా ప్రత్యేక శిబిరాలు కనిపించ లేదు. మండలానికి మంజూరైన చిన్నహ్యాట, హెబ్బటం, హొళగుంద-3 ఆధార్ కేంద్రాలను షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు ఆధార్ నమోదు చేపట్టాల్సి ఉంది. ఈ నెల 17న చిన్నహ్యాట, బీజీ హళ్లి, పెద్దహ్యాట, ఇంగళదహాళ్, ఎండీ హళ్లీ, పెద్దగోనెహాళ్, హొళగుంద 1, 4, 5, 6 అంగన్‌వాడీ కేంద్రాలో క్యాంపు ఏర్పాటు చేసి పిల్లల ఆధార్ నమోదు చేపట్టాలి. అలాగే 18న నెరణికి, హెబ్బటం, హొళగుంద 10, 11, 12, 13 అంగన్‌వాడీ సెంటర్లు, 19న సుళువాయి, వందవాగిలి, హొళగుంద 7, 3వ సెంటర్, 20న ఎల్లార్తి, గజ్జహళ్లి, హొళగుంద 2, 9వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేపట్టాలి. అయితే సచివాలయంలోనే నమోదు శిబిరాలు ఏర్పాటు చేయడంతో అక్కడి వచ్చేందుకు చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడడంతో పాటు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.



ఆలూరు-కర్నూలు రహదారిని కమ్మేసిన పొగమంచు



ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే దారిలో పరిసరాలు కనిపించనంతగా మంచు

ఆలూరును కమ్మేసిన పొగమంచు

ఆలూరు: రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. జిల్లాలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు ఆలూరులో నమోదవుతుండటం విశేషం. మునుపెన్నడూ లేనంతగా 14 డిగ్రీలు, 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఆరు గంటలకు మంచు కురవడం, చలి తీవ్రంగా ఉంటోంది. ఇక అర్ధరాత్రి దాటిన తరువాత తీవ్రత మరింత అధికంగా ఉంటోంది. ఉదయం ఎనిమిది గంటలైనా పొగ మంచు వీడటం లేదు. దీంతో ప్రయాణికులు ఎదురుగు వచ్చే వాహనాలు, రహదారి కనిపించక లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణం సాగిస్తున్నారు. మంచుదుప్పటి కారణంగా పట్టణంలో పరిసరాలు కూడా కనిపించడం లేదు.

భూ సమస్యల పరిష్కారమే సదస్సుల లక్ష్యం

పత్తికొండ(తుగ్గలి) : భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ రమేష్ అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుంచి 30 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. వీఆర్వోలు రామాంజనేయులు, సాగర్‌రెడ్డి, రవి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..

మండలంలోని పగిడిరాయిలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి పాల్గొన్న ఈ సదస్సులో వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎనిమిది అర్జీలు ఇచ్చారు.

కృష్ణగిరి: మండల వ్యాప్తంగా భూ సమస్యల్ని పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి నూకరాజు పేర్కొన్నారు. కంబాలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 30 అర్జీలు వచ్చాయన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని ఎస్. బోయినపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎ

ఆస్పరి: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్ సూచించారు. మండలంలోని నగరూరులో గురువారం రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. తహ సీల్దార్ శివశంకర్ నాయక్, డీటీ భీమేష్ పాల్గొన్నారు.

హాలహర్వి: రెవెన్యూ సదస్సులతో పూర్తిస్థాయిలో భూ సమస్యలు పరిష్కారమవుతాయని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కామినహాల్, మెదేహాల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కామినహాల్–మల్లికార్జునపల్లికి వెళ్లే దారి చాలా సంవత్సరాల నుంచి అడ్డంకులు సృష్టిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. అలాగే గ్రామంలో చెరువుకు 400 ఎకరాలు భూమి ఉందని, దాన్ని అందరూ అక్రమంగా విత్తుకుని చెరువుని లేకుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ నజ్మాబాను, ఎంపీడీఓ వరలక్ష్మి, మండల సర్వేయర్ మంజుభార్గవి, ఆర్ఐ మహేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.



కామినహాల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 16 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు.

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారంలో తహసీల్దార హుసేన్‌సాహెబ్ గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి 23మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

హొళగుంద: సుళువాయి గ్రామంలో సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో తహసీల్దారు సతీష్ గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి మొత్తం 16 మంది నుంచి అర్జీలు తీసుకున్నారు. అలాగు కుల, ఆదాయ పత్రాల మంజూరుకు గ్రామస్తులు దరఖాస్తులు అందజేశారు.

ప్రచారానికే రెవెన్యూ సదస్సులు

దేవనకొండ: రీ సర్వే సందర్భంగా వచ్చిన రెవెన్యూ సమస్యలపై అధికారుల సాగదీత ధోరణి, నాన్చుడు వైఖరి అవలంభిస్తున్నారని సీపీఎం నాయకులు తహసీల్దార్ కారు ముందు బైఠాయించారు. ఈ మేరకు గురువారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయితే తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్ మొక్కుబడిగా సమాధానం చెప్పి వెళ్లిపోతుండగా సీపీఎం నాయకులు వీరశేఖర్, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు కారు ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని, ఈ సదస్సుల వల్ల రైతులకు, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని మండిపడ్డారు.

సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు.

స్థలదాతలకు దుకాణాలు కేటాయించాలి

ఎంపీడీఓ కార్యాలయ స్థలదాత కుటుంబ వారసులకు ఎంపీడీఓ కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు షాపులు కేటాయించాలని స్థలదాత వారసులు వేణుగోపాల్ శెట్టి గురువారం ఎంపీడీఓకు అర్జీ అందజేశారు. 1965లో ఆలూరుకు చెందిన అరళయ్య శెట్టి ఎంపీడీఓ కార్యాలయం నిర్మాణానికి 2.43 ఎకరాలు దానంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదు. మూడేళ్ల క్రితం రూ.80 లక్షలతో 18 షాపులను నిర్మించి త్వరలో బహిరంగ వేలం వేయనున్నారు.

చిప్పగిరి: సుపరిపాలనా వారోత్సవాల్లో భాగంగా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అల్లాబకాష్ మండల ప్రజలకు సూచించారు.గురువారం స్థానిక సచివాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించారు.కార్యక్రమం ఈ నెల 24 వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈఓపీ ఆర్డీ బాలన్న పాల్గొన్నారు.

మద్దికెర : సుపరిపాలనలో భాగంగా ఈనెల 24 వరకు నిర్వహించే ప్రశాసన్ గావోం కి ఓర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య గురువారం తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు.

ఇరుముడితో శబరిమలకు..



ఆస్పరి: మండల కేంద్రం నుంచి 18 మంది అయ్యప్ప మాలధారులు గురువారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. రామతీర్థంలో అయ్యప్ప స్వామి వారికి గురుస్వామి అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి స్వీకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భజనలు, భిక్ష చేపట్టారు. చివరగా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు వారిని ఊరేగింపుగా వీడ్కోలు పలకగా.. స్వామి దర్శనానికి బయలుదేరారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



నరసాపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాలను శుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతి రోజు తడి, పొడి చెత్తను ఇళ్ల నుంచి స్వీకరించాలని డీఎల్‌పీఓ లక్ష్మి ఆదేశించారు. మండలంలోని నరసాపురం గ్రామంలోని సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం డీపీఆర్‌సీ డీసీ మంజులవాణితో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని తడి, పొడి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుకు తరలించి వర్మీకంపోస్టు తయారీని చేసి రైతులకు అమ్మి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యదర్శులు రహమత్‌బాషా, శ్రీనివాసులు ఉన్నారు.

అశ్వగంధ పంట పరిశీలన



జొహరాపురం సమీపంలో అశ్వగంధ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మద్దికెర/ఆస్పరి : మండల కేంద్రంతో పాటు ఆస్పరి మండలంలోని జొహరాపురం గ్రామ పొలాల్లో సాగు చేస్తున్న ఔషధ పంట అయిన అశ్వగంధ పంటను వెంకటరామన్న గూడెం ఉద్యాన యూనివర్సిటీ, పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ రంగన్న, డాక్టర్ ఆదర్శ గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటలను ఆశిస్తున్న కీటకాలు, తెగుళ్ల గురించి నమోదు చేసుకోవడంతో పాటు మేలైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ రవి, ఉద్యాన అధికారి డాక్టర్ ఇందిర, ఏఈఓ భోజరాజు, సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు ఉపాధ్యాయ రత్న పురస్కారం



తెలంగాణ హైకోర్టు జడ్జి జి.చంద్రయ్య నుంచి అవార్డు అందుకుంటున్న చంద్రమోహన్

తుగ్గలి : మండలంలోని లక్ష్మీతండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అద్దంకి చంద్రమోహన్ యాదవ్‌కు ఉపాధ్యాయ రత్న అవార్డు దక్కింది. ఆల్ ది బెస్ట్ ఆర్ట్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 15న హైదరాబాద్ సుందరయ్య కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య నుంచి జాతీయ ఉపాధ్యాయ రత్న పురస్కారాన్ని చంద్రమోహన్ అందుకున్నారు. గిరిజన తండాల్లో విద్యాభివృద్ధికి చేసిన కృషికి ఈ అవార్డు లభించిందని ఆయన చెప్పారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు



చింతకుంట రిజర్వాయర్ వద్ద పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆలూరు: పట్టణ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ.. డీఈ, ఏఈలను ఆదేశించారు. గురువారం ఆమె హాలహర్వి మండలంలోని చింతకుంట రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఎల్లెల్సీ ప్రవహిస్తున్నప్పుడు నీటిని పంప్ చేసుకోవాలని సూచించారు. ఇలా పంప్ చేసుకోవడం వల్ల వేసవిలో నీటి ఎద్దడి తలెత్తదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.